క్లుప్తంగా

ఘనంగా పేరంటాలమ్మతల్లి జాతర



కిర్లంపూడి: మండలంలోని చిల్లంగిలో వేంచేసిన పేరంటాలమ్మతల్లి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని గ్రామస్తులు, దాతల సహకారంతో బుధవారం అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు.

రెండు వేల ఎకరాల్లో పంట నష్టం

తుని రూరల్: వాయుగుండం ప్రభావంతో భారీగా కురిసిన వర్షాలకు తుని నియోజకవర్గంలో రెండు వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా తెలిసిందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. మండలంలోని హంసవరం శివారు జిల్లేడుపాడులో సోమవారం ఆమె పర్యటించారు. కత్రాళ్లకొండ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తాండవ నదిపై ఉన్న మినీ రిజర్వాయర్‌ను, హంసవరం సమీపంలోని కేఎంఆర్ ట్యాంకు కళింగలను, ముంపునకు గురైన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. విస్తారంగా కురిసిన వర్షాలతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, ములికి సూరిబాబు, ఎంపీడీఓ రవికుమార్ పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తరలింపునకు చర్యలు

జగ్గంపేట: గ్రామంలో శిథిలావస్థలో ఉన్న బీసీ హాస్టల్‌ను స్థానిక శివాలయం సమీపంలోని పాత మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనంలోకి మారుస్తున్నట్లు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. సోమవారం నూతన హాస్టల్ భవనం వద్ద పనులను ఆయన పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయం వెనుక బీసీ హాస్టల్ భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని, దీంతో యుద్ధ ప్రాతిపదికన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనంలోకి మార్చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అక్కడ డార్మెంటరీ, మరుగుదొడ్లు, వంటశాల, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు.

బాలింతలకు రక్త పరీక్షలు

జగ్గంపేట: స్థానిక శెట్టిబలిజీపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం బాలింతలకు రక్త పరీక్షలు చేశారు. పోషకాహార మహోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రక్తహీనత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలన్నారు. రక్తహీనత వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.సునీత, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గరాణి పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు

ఏలేశ్వరం: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని లింగంపర్తిలో సోమవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా సేవా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 65 మంది రక్తదానం చేశారు. ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి డాక్టర్లు రక్తం సేకరించారు. అనంతరం గ్రామంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పాల్గొన్నారు. మండలంలోని మర్రివీడులో ప్రజలకు సోమవారం ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం, విజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. అనుసూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తునిలో రక్తదాన శిబిరం

తుని: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని సోమవారం తునిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక రాజా కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని జనసేన తుని నియోజకవర్గ ఇన్‌చార్జి చోడిశెట్టి గణేష్ ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో యువత రక్తదానం చేశారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలంటూ ఆందోళన

తుని: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ తుని శాఖ కార్యదర్శి ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచశాంతికి అమెరికా, నాటో దేశాలు విఘాతం కలిగిస్తున్నాయన్నారు. ఇజ్రాయిల్ దాడుల్లో 40 వేల మంది ప్రజలు మరణించారని, ఇందులో 20 వేల మంది చిన్నారులు ఉన్నారన్నారు. తక్షణమే యుద్ధాన్ని ఆపి శాంతిని నెలకొల్పాలని కోరారు.



వి.కొత్తూరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు నాగేశ్వరరావు, నాయకులు



గోకవరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న తోట నరసింహం



శంఖవరంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ పర్వత రాజుబాబు, నాయకులు



జగ్గంపేటలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జ్యోతుల రామస్వామి, నాయకులు

జనం మదిలో రాజన్న పదిలం

- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి
- మహానేతకు నివాళులర్పించిన నాయకులు, ప్రజాప్రతినిధులు
- గ్రామాల్లో సేవా కార్యక్రమాలు

కిర్లంపూడి: పేదల ఆశాజ్యోతి, అభివృద్ధి ప్రదాత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం తీరని లోటు అని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం మండలంలోని పాలెం, బూరుగుపూడి గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ యువ నాయకుడు తోట రాంజీతో కలిసి ఆయన పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. కార్యకర్తలతో కలిసి జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. కిర్లంపూడిలో పెంటకోట నాగబాబు ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు తోట బాబ్జీ, అడబాల సుబ్బారాయుడు, పాటంశెట్టి కృష్ణమూర్తి, ఆశపు బద్రి, అరబోలు వాసు, రాపేటి శ్రీను, ఓలేటి రాజు, వేగి రామకృష్ణ పాల్గొన్నారు.

తుని: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా తుని పట్టణం శ్రీరామా థియేటర్ సెంటర్లో వైఎస్సార్ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు, పట్టణ శాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచంద్రరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యనమల కృష్ణుడు మాట్లాడుతూ ప్రజల సంక్షేమ కోసం ఎనలేని సేవలు అందించిన మహానేత రాజన్నను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలు మహానేతను ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటారన్నారు. కార్యక్రమంలో కోటనందూరు ఎంపీపీ లగుడు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, తొండంగి వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ అల్లాడ దివాణం, పామర్తి మహేష్, తాండవ సుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు, నాయకులు పోతల రమణ, చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: సంక్షేమ సారథి, పేదల ఆశాజ్యోతి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం నియోజకవర్గవ్యాప్తంగా నిర్వహించారు. లింగంపర్తిలో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు తనయుడు వరుపుల రాజబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వరుపుల చిట్టిబాబు, అల్లు సూరిబాబు, వల్లంరెడ్డి నర్సారావు, కురువెళ్ల గుర్రాజు పాల్గొన్నారు. ఏలేశ్వరంలో వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో లింగంపర్తి రోడ్, నర్సీపట్నం రోడ్, పాతబస్టాండ్ సమీపంలోని వినాయకుని గుడి, యర్రవరం రోడ్ తదితర ప్రాంతాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నేతలు సామంతుల సూర్యకుమార్, బదిరెడ్డి గోవిందు, యిజనగిరి ప్రసాద్, ఎస్.వెంకటేశ్వరరావు, దోకిషోర్, పైల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



పాలెంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న తోట నరసింహం, తోట రాంజీ తదితరులు

మహానేత సేవలు మరువలేం

శంఖవరం: దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని ఎంపీపీ పర్వత రాజుబాబు అన్నారు. శంఖవరంలో వైఎస్సార్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పడాల దొంగబాబు, బొమ్మిడి లిల్లియ్య, ఆచంట వెంకటేశ్వరరావు, గుద్దాడ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం: గ్రామంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి గ్రామ ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, ఎంపీటీసీ దడాల సతీష్, పార్టీ నాయకుడు కొండపల్లి అప్పారావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేవస్థానం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండి సతీష్, పంచాయతీ వార్డు సభ్యుడు సోము గౌరీశంకర్, ఆశిన శ్రీనివాస్, సింగంపల్లి రాము పాల్గొన్నారు.

జగ్గంపేట: స్థానిక బస్టాండ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ జోహార్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. వైఎస్సార్ సహకారంతోనే జగ్గంపేటలో డిగ్రీ కాలేజీ, ఫైర్ స్టేషన్, పుష్కర ఎత్తిపోతల పథకం, జగ్గంపేట, గండేపల్లి మండలాలకు తాగునీరు అందించే భావవరం ఫిల్టర్ బెడ్స్ నిర్మించినట్టు తెలిపారు. తోట రాంజీ, పార్టీ మండలాధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, కురుటూరి వీర్రాజు, కాపారపు ప్రసాద్, తులా రాము పాల్గొన్నారు.

జ్యోతుల చంటిబాబు కార్యాలయంలో..

జగ్గంపేటలోని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కార్యాలయంలో ఆయన తండ్రి జ్యోతుల రామస్వామి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి రామస్వామి, పార్టీ శ్రేణులు పూలమాల వేసి నివాళులర్పించారు. జగ్గంపేట ఉప సర్పంచ్ బండారు రాజా, పెద్దాడ రాజబాబు, అప్పారావు కాపు, ఒబ్బిణి వీరబాబు పాల్గొన్నారు. జగ్గంపేటలో జెడ్పీటీసీ ఒమ్మి బిందు మాధవి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం తదితరులు పాల్గొన్నారు.



లింగంపర్తిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



తొండంగిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైస్ ఎంపీపీ నాగం గంగబాబు

గోకవరం: గ్రామంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ మెట్ట ప్రాంతానికి, గోకవరం మండలానికి వైఎస్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ యువ నాయకుడు తోట రాంజీ, నాయకులు దాసరి చినబాబు, వరసాల ప్రసాద్, సుంకర వెంకటరమణ, కర్రి సూరారెడ్డి, అక్షింతల రాజా, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, కూరాకుల సుమంగళి, తోలేటి రాంప్రసాద్, నరాలశెట్టి నర్సయ్య, రౌతు జోగేశ్వరరావు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని ఏవీ నగరంలో వైఎస్సార్ విగ్రహానికి తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దానవాయిపేటకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి మడదా హేమంత్ తునిలో వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. తొండంగిలో వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు, మురాలశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరం, డి.పోలవరం, ఎన్.సూరవరం, తాళ్లూరు, తేటగుంట, హంసవరం, టి.తిమ్మాపురం, వి.కొత్తూరు, కేఓ మల్లవరం, జిల్లేడుపాడు, వల్లూరు, హెచ్.కొత్తూరు, చేపూరు తదితర గ్రామాల్లో సోమవారం వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. గ్రామాల్లోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల కన్వీనర్ దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, పోతుల లక్ష్మణ్, జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, మాజీ సర్పంచ్ చింతల వెంకటరమణ, తమరాన శ్రీనివాసరావు, చిటికెల వరహాలబాబు పాల్గొన్నారు.

రౌతులపూడి: స్థానిక మార్కెట్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండల నేత వాసిరెడ్డి జమీలు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ శ్రేణులు జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, సర్పంచులు సర్పం శ్రీను, రాపర్తి రామకృష్ణ, చిందాడ పెదరాజు, ఎంపీటీసీ బొడ్డు రాజు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ పాల్గొన్నారు.



తునిలో దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



రౌతులపూడిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గండేపల్లి: స్థానిక చెరువు గట్టుపై ఉన్న వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. మురారీలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, సర్పంచులు రుత్తల లలిత, ములంపాక సురేష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఒబిణ్ని వీరబాబు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, తాళ్లూరి మధు పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలోని బిళ్లనందూరులో ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు.

జన హృదయ నేత వైఎస్సార్

ప్రత్తిపాడు రూరల్: కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జనం హృదయాల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారని ఎంపీపీ గొల్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి అన్నారు. ప్రత్తిపాడులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులరించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఒమ్మంగిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ గొల్లపల్లి దొరబాబు, మదినే నూకరాజు, మేడిబోయిన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

ముంపు పొలాల పరిశీలన

తొండంగి: పంపా రిజర్వాయర్‌లోని అదనపు జలాలను దిగువకు విడుదల చేసిన నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. పి.అగ్రహారం, ఏ.కొత్తపల్లి, పైడికొండ తదితర గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను సోమవారం వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు, పార్టీ నాయకులు పరిశీలించారు. ముంపు కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు బత్తుల వీరబాబు, వనపర్తి సూర్యనాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే దివ్య

మండలంలోని పెరుమాళ్లపురంలో ముంపు బారిన పడిన వీధులను ఎమ్మెల్యే యనమల దివ్య సోమవారం పరిశీలించారు. అనంతరం పలు ప్రాంతాల్లో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.



పి.అగ్రహారంలో వరి పొలాలను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

అన్నవరం: శ్రావణ అమావాస్యను పురస్కరించుకుని సోమవారం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు యనమంద్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, ఫణి శర్మ, శివ, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 50 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్న క్యాంటీన్లు ప్రారంభం

జగ్గంపేట: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని జగ్గంపేట బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో ప్రతి సోమవారం జరిగే పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. పాత పోలీసు స్టేషన్ వద్ద డొక్కా సీతమ్మ క్యాంటీన్‌ను జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జి తుమ్మలపల్లి రమేష్ ప్రారంభించారు. ప్రతి సోమవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం నిర్వహిస్తామని జనసేన నేత తుమ్మలపల్లి రమేష్ తెలిపారు.

సంక్షిప్తంగా..

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

శంఖవరం: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ నరసింహ నాయక్ వైద్యులకు సూచించారు. స్థానిక పీహెచ్‌సీని సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, ఆసుపత్రి పరిసరాలు, పడక గదులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జ్వరాల కేసులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు ఆర్‌వీవీ సత్యనారాయణ, శెట్టిబత్తుల రాజీవ్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో అధిక లాభాలు

శంఖవరం: కూరగాయలు పండించడం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యాన అధికారి ఎస్.మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని వజ్రకూటంలో ఆయిల్ పామ్, కూరగాయల పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా ఉండడంతో పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి పి.అరుణ్‌కుమార్, ఉద్యానశాఖ సహాయకులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడి, పాలెం, సోమరాయణంపేట, కృష్ణవరం, గోనేడ గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను సోమవారం జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి ఎస్.విజయకుమార్ పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేసి రిపోర్టు చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారి జోకా అమృతను ఆదేశించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

గండేపల్లి: ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి సూచించారు. క్లీన్ ఆంధ్రా-గ్రీన్ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం వన మహోత్సవం నిర్వహించారు. సూరంపాలెంలో ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

గండేపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్లభాషపై పట్టు సాధించినప్పుడే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆదిత్య యూనివర్సిటీ డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డి అన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలోని గ్లోబల్ బిజినెస్ స్కూల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు సోమవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు కళాశాల విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ద్వారా అర్థమెటిక్, రీజనింగ్‌పై శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.విజయభార్గవి, ఎం.గోవర్ధన్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఏలేశ్వరం: వర్షాలకు పంట నష్టపోకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి సూచించారు. మండలంలోని యర్రవరం, తిరుమాలి గ్రామాల్లోని వరిపొలాలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట పిలకల దశ, దుబ్బుకట్టే దశలో ఉందన్నారు. అధిక వర్షాలకు పంట నష్టపోకుండా నీరు వెంటనే బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్ఐసీ ఆవిర్భావ వేడుకలు

తుని: భారత జీవిత బీమా సంస్థ 68వ ఆవిర్భావ వేడుకలను మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు జ్యోతి ప్రజ్వలన చేసి సోమవారం ప్రారంభించారు. జీఎన్‌టీ రోడ్డులోని ఎల్ఐసీ తుని శాఖ కార్యాలయంలో బ్రాంచి మేనేజరు జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వారం రోజుల పాటు విద్యార్థులకు వ్యాస రచన, చిత్రల లేఖనం, పాటల పోటీలు నిర్వహిస్తామని బీఎం సత్యనారాయణ తెలిపారు.

గోకవరం: స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో ఎల్ఐసీ ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రాంచి మేనేజర్ కె.విద్యాసాగర్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ప్రజలకు ఎల్ఐసీ అందిస్తున్న పాలసీలను వివరించారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. అనంతరం ఎల్ఐసీలో 32 ఏళ్లుగా సేవలందిస్తున్న స్వరాజ్యలక్ష్మి ఘనంగా సత్కరించారు. ఏబీఎం వి.విజయకోటేశ్వరరావు, ఏఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సారాతో మహిళ అరెస్టు

జగ్గంపేట: మండలంలోని రామవరంలో 20 లీటర్ల సారాతో ఓ మహిళను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై రఘునాథరావు తెలిపారు. రామవరంలో సారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి 20 లీటర్ల సారాతో మేడిశెట్టి వెంకటలక్ష్మిని అరెస్టు చేశామన్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.